వైభవంగా యాదగిరీశుడి కల్యాణోత్సవం

యాదగిరిగుట్ట అనుబంధ రామలింగేశ్వర ఆలయంలో స్పటిక లింగేశ్వరుడికి హారతి ఇస్తున్న పురోహితుడు

యాదగిరిగుట్ట, జూలై 1 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవ సేవను అర్చకులు అత్యంత వైభవంగా నిర్వహించారు. సోమవారం ప్రధానాలయం మొదటి ప్రాకార మండపంలో కల్యాణమూర్తులను దివ్య మనోహరంగా అలంకరించి గజ వాహనంపై వేంచేపు చేసి సేవను కొనసాగించారు. తూర్పునకు అభిష్టంగా స్వామి, అమ్మవార్లను వేంచేపు చేసి నిత్య తిరుకల్యాణోత్సవం జరిపారు. సుమారు గంటన్నర పాటు సాగిన వేడుకల్లో భక్తులు పాల్గొని కల్యాణోత్సవాన్ని తిలకించారు. స్వయంభూ నారసింహుడికి నిత్యోత్సవాలు తెల్లవారుజామునే ప్రారంభమయ్యాయి. ఉదయం ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపారు. తిరువారాధన జరిపి స్వామి, అమ్మవార్లకు బాలభోగం జరిపారు. స్వయంభూ నారసింహుడికి నిజాభిషేకం నిర్వహించి భక్తులకు స్వామివారి నిజరూప దర్శనం కల్పించారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన జరిపి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఉదయం వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం నిర్వహించిన అర్చకులు సుదర్శన ఆళ్వారులను కొలుస్తూ హోమం జరిపారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లను గరుఢ, తిరుచ్చి వాహనాలపై వేంచేపు చేసి ఆలయ మాఢవీధుల్లో సేవను ఊరేగించారు. రాత్రి దర్బార్ సేవ, నివేదన, శయనోత్సవం సేవ అత్యంత వైభవంగా సాగింది. రామలింగేశ్వర కుటుంబంతోపాటు ఆలయంలో స్పటిక లింగేశ్వరుడికి ప్రభాతవేళ మహన్యాస పూర్వక రుద్రాభిషేకాన్ని సుమారు గంటన్నర పాటు జరిపారు. సాయంత్రం రామలింగేశ్వరుడికి సేవను శివాలయ మాఢవీధుల్లో ఊరేగించారు. శివాలయం ప్రాకార మండపంలో నిత్య రుద్ర హోమం అత్యంత వైభవంగా సాగింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు నిరాటంకంగా సాగాయి. సుమారు 9వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ.20,84,631 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

మెనూ పాటించని గురుకులం

- మోత్కూరు గురుకులంలో తిండి తినలేక అవస్థలు పడుతున్న విద్యార్థులు
- పట్టించుకోని అధికారులు

నీళ్ల చారులా ఉన్న దోసకాయ కూర

మోత్కూరు, జూలై 1 : మున్సిపాలిటీ కేంద్రంలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల విద్యాలయంలో భోజనం అధ్వాన్నంగా తయారైంది. నీళ్ల చారు, నాణ్యత లేని దోసకాయ కూర, ఉడికీ ఉడకని అన్నం వడ్డిస్తున్నారని విద్యార్థులు పేర్కొంటున్నారు. పాఠశాలలో 496 మంది విద్యార్థులు వసతులు పొందుతుండగా.. ఎనిమిదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు 202 మంది విద్యార్థులు పోతాయిగడ్డలోని అద్దె భవనంలో ఉంటున్నారు. ఐదో తరగతి నుంచి ఏడో తరగతి వరకు 294 మంది విద్యార్థులు బస్టాండ్ సమీపంలోని మరో అద్దె భవనంలో వసతి పొందుతున్నారు. వేర్వేరుగా తరగతులు, వసతులు పొందుతున్నా నిర్వహణ మొత్తం ప్రిన్సిపాల్ ఒక్కరే చూస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిత్యం మెరుగైన మెనూ అందించాలి. కానీ.. మార్కెట్‌లో తక్కువ ధరకు దొరికే వాడిపోయిన, కుళ్లిపోయిన కూరగాయలు తీసుకొచ్చి వండుతున్నారని విద్యార్థులు చెబుతున్నారు. అద్దె భవనం కావడంతో వసతి సరిగా లేదని, పదేండ్ల నుంచి పాఠశాల భవనానికి సున్నం కూడా వేయకపోవడంతో అధ్వాన్నంగా కన్పిస్తున్నదన్నారు. భోజనాలు చేసే డైనింగ్ హాల్ రేకుల షెడ్డు పైకప్పు లేచిపోయింది. పాఠశాల ఆవరణలో విద్యార్థులు కింద కూర్చొని భోజనం చేస్తున్నారు. వంట గది సరిగా లేదు, మరుగుదొడ్లు, మూత్రశాలలు ఇబ్బందిగా ఉన్నాయి. ప్రహరీ లేకపోవడంతో పందులు, కుక్కలు పాఠశాల ఆవరణలోకి వస్తున్నాయని విద్యార్థులు తెలిపారు. నిర్వహణ సరిగా లేకపోవడంతో ప్రశాంతంగా తిండి తినలేని దుస్థితి నెలకొంది.

పాఠశాల ఆరుబయట కింద కూర్చొని భోజనం చేస్తున్న విద్యార్థులు

తిండి తినలేకపోతున్నాం

మా పిల్లలకు పెట్టే భోజనం బాగుండడం లేదు. అన్నం తినలేక పోతున్నామని పదేపదే చెబుతున్నారు. ఉడికీ ఉడకని అన్నం, నీళ్ల చారు, కూరలు పెడుతున్నారు. ఇలా అయితే ఆందోళన చేయాల్సి వస్తుంది. గతంలో అనేక సార్లు చెప్పాం. అయినా.. పట్టించుకోవడంలేదు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలి.

– డి.భిక్షం, విద్యార్థి తండ్రి, చిత్తాపురం

నాణ్యమైన కూరగాయలు సరఫరా చేయడం లేదు

పాఠశాలకు కాంట్రాక్టర్ కూరగాయలను సరైన విధంగా సరఫరా చేయడం లేదు. మేము ఎంత చెప్పినా ఫలితం లేకుండా పోయింది. మెనూ ఎందుకు అమలు చేయడం లేదని అడిగితే మౌనం వహించారు. టెండర్లు ఉన్నందున భువనగిరి వెళ్లానని చెప్పారు.

– వెంకటస్వామి, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్

ఎంపీపీ, ఎంపీటీసీలను సన్మానిస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

మనం చేసిన మంచి పనులతోనే గుర్తింపు

- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

ఆలేరు రూరల్, జూలై 1 : ప్రజాప్రతినిధులుగా మనం చేసిన మంచి పనులే రాజకీయంగా, సమాజపరంగా గుర్తింపునిస్తాయని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గంధమల్ల అశోక్ అధ్యక్షతన సోమవారం జరిగిన మండల సాధారణ సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఐలయ్య మాట్లాడుతూ ఎంపీటీసీల పదవీ కాలం జూలై 4న ముగుస్తుందని, వారు ఐదేండ్లుగా పదవిలో ఉండి ప్రజా సమస్యలు పరిష్కరించడంలో కీలక పాత్ర పోషించారని అన్నారు. గంధమల్ల అశోక్ ఎంపీపీగా అన్ని శాఖల అధికారులతో సమన్వయంగా పనిచేసి మండల అభివృద్ధికి కృషి చేశారని తెలిపారు. పదవీ కాలం ముగిసిన ప్రజాప్రతినిధులు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రత్యేకాధికారులు సమన్వయంతో సమస్యలను పరిష్కరించే దిశగా పనిచేయాలన్నారు. అనంతరం ఎంపీపీ, ఎంపీటీసీలను సన్మానించారు. సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ మొగులగాని మల్లేశ్‌గౌడ్, వైస్ ఎంపీపీ గాజుల లావణ్య, ఎంపీటీసీలు ఆరె ప్రశాంత్, నరేందర్‌రెడ్డి, కవిత, లక్ష్మి, ఎంపీడీఓ సత్యానందప్రసాద్, ఎంపీఓ సలీమ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఔట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శుల వినతి

తమ సమస్యలను పరిష్కరించాలని ఔట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు వినతిపత్రం అందజేశారు. తమను జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా గుర్తించి రెగ్యులర్ చేయాలని, గ్రేడ్ 4 కార్యదర్శులుగా బదిలీలు వర్తింపజేయాలని కోరారు. విధి నిర్వహణలో మరణించిన వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గనగాని శశికాంత్ గౌడ్, రామకృష్ణ, మహేందర్, రాహుల్‌రెడ్డి, ఇందిర, శ్రీకాంత్‌రెడ్డి, మల్లేశ్, కనకరాజు, సర్వర్‌నాయక్ పాల్గొన్నారు.

రైతు భరోసా పకడ్బందీ అమలుకు సర్కారు చర్యలు

- జిల్లా వ్యవసాయ అధికారి అనూరాధ

అభిప్రాయ సేకరణలో మాట్లాడుతున్న డీఏఓ అనూరాధ

భూదాన్ పోచంపల్లి, జూలై 1 : రైతు భరోసా పథకాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు ప్రభుత్వం రైతుల నుంచి సలహాలు, సూచనలు తీసుకుంటుందని డీఏఓ అనూరాధ అన్నారు. పట్టణంలోని పీఏసీఎస్ ఆవరణలో సోమవారం రైతు భరోసాపై అభిప్రాయ సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా డీఏఓ మాట్లాడుతూ అధికారుల సలహాలు పాటించి రైతులు అధిక దిగుబడి సాధించాలన్నారు. రైతు భరోసా అభిప్రాయ సేకరణను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. అందరి సూచనలు పరిగణలోకి తీసుకొని సబ్ కమిటీతో చర్చించి జూలై 15లోగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. సింగిల్ విండో చైర్మన్ కందాడి భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ రైతుల ఖాతాల్లో ఠంచన్‌గా రైతుబంధు వేశారన్నారు. రైతు భరోసా పథకంపై ఆంక్షలు విధించడం సరికాదని, భూమి సాగు చేసిన వారందరికీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పండించిన ప్రతి ధాన్యానికీ బోనస్ ఇవ్వాలని, బేషరతుగా రైతులందరికీ రుణమాఫీ చేయాలని కోరారు. రియల్ ఎస్టేట్ భూములకు ఐటీ, ప్రొఫెషనల్ డాక్టర్స్, ప్రభుత్వ ఉద్యోగుల భూములకు రైతు భరోసా అవసరం లేదని అన్నారు. పదెకరాల్లోపు రైతులందరికీ రైతుబంధు, ధాన్యానికి మద్దతు ధర రూ.2,500 ఇవ్వాలని రైతు గుర్రం లక్ష్మీరెడ్డి అన్నారు. సేద్యం కాని భూములకు ఇవ్వవద్దని తెలిపారు. సాగు చేసిన రైతులందరికీ రైతు భరోసా ఇవ్వాలని రైతు వారాల రామచంద్రారెడ్డి అన్నారు. పనికిరాని భూములు, సేద్యం చేయని వారికి రైతు భరోసా ఇవ్వవద్దని చెప్పారు. సామాన్య రైతులను ఐటీ నుంచి మినహాయించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పాక వెంకటేశ్‌యాదవ్, కో ఆపరేటివ్ సొసైటీ అధికారి లక్ష్మి, ఏఓ ఏజాజ్ అలీఖాన్, సీఈఓ సత్తుపల్లి బాల్‌రెడ్డి, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

రైతుబంధు తక్షణమే జమ చేయాలి

- జడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి

భువనగిరి అర్బన్, జూలై 1 : కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేయకుండా రైతుల ఖాతాల్లో రైతుబంధు డబ్బులు తక్షణమే జమ చేయాలని జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని పీఏసీఎస్ కార్యాలయలో సోమవారం సమావేశం ఏర్పాటు చేసి రైతు భరోసా పథకంపై రైతుల సలహాలు, సూచనలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రైతులు ఇప్పటికే నాట్లు వేస్తుంటే.. ప్రభుత్వం సభలు, సమావేశాలతో కాలయాపన చేస్తున్నదన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుబంధు డబ్బులను నారు పోసే సమయంలోనే జమ చేసేదని, ఆ డబ్బులను రైతులు పెట్టుబడికి ఉపయోగించుకునే వారని అన్నారు. ప్రస్తుతం రైతుబంధు కోసం రైతులు ఎదురుచూసి నిరాశ చెందారని తెలిపారు. రైతులు పెట్టుబడి కోసం అప్పులు చేసి నాట్లు వేస్తున్నారని, కొందరు నాటు వేయడానికి వెనుకంజ వేస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెట్టుబడి సాయం అందజేయాలని కోరారు.

కార్యక్రమంలో భువనగిరి పీఏసీఎస్ చైర్మన్ నోముల పరమేశ్వర్‌రెడ్డి, డీఏఓ అనూరాధ, అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఈశ్వరయ్య, ఏడీఏ దేవ్‌సింగ్, ఎంఏఓ పావని, పీఏసీఎస్ వైస్ చైర్మన్ మహేందర్‌నాయక్, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

- ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

పోచంపల్లి : ప్రమీలారెడ్డి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

భువనగిరి కలెక్టరేట్, జూలై 1 : గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని హన్మాపురం, బస్వాపురం, ముత్తిరెడ్డిగూడెం, అనాజిపురం గ్రామాల్లో పలు అభివృద్ధి పనులను సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం నిరంతరం పాటుపడుతుందన్నారు. కార్యక్రమాల్లో ఎంపీపీ నరాల నిర్మల, జడ్పీటీసీ సుబ్బూరు బీరుమల్లయ్య, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు పాల్గొన్నారు.

ప్రమీలారెడ్డికి ఎమ్మెల్యే నివాళి

భూదాన్ పోచంపల్లి : పట్టణంలోని బాలాజీ ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు మర్రి నరసింహారెడ్డి మాతృమూర్తి ప్రమీలారెడ్డి సంతాప సభను సోమవారం నిర్వహించారు. భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి పాల్గొని ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు పాక మల్లేశ్‌యాదవ్, డీసీసీ ఉపాధ్యక్షులు కళ్లెం రాఘవరెడ్డి, సామ మధుసూదన్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు భారత లవకుమార్, నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం : ఎమ్మెల్యే వీరేశం

రామన్నపేటలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

రామన్నపేట, జూలై 1 : గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నామని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాల్లో కోటి రూపాయల ఎస్‌డీఎఫ్ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. అధికారులు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పూస బాలమణి, జడ్పీటీసీ పున్న లక్ష్మి, వైస్ ఎంపీపీ నాగటి ఉపేందర్, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సీపీఐ వినతి

పట్టణంలోని ప్రభుత్వ దవాఖాన స్థాయిని 100 పడకలకు పెంచాలని, ఖాళీగా ఉన్న వైద్య సిబ్బంది పోస్టులను భర్తీ చేయాలని సీపీఐ నాయకులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఆర్ అండ్ బీ రోడ్డు వెంట ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించాలని, విస్తరణ చేపట్టిన చిట్యాల – భువనగిరి రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో సీపీఐ మండల కార్యదర్శి ఊట్కూరి నర్సింహ, నాయకులు శివరాత్రి సమ్మయ్య, బాలగోని మల్లయ్య, మాజీ ఎంపీటీసీ ఊట్కూరి శోభ, భగవంతం, ముత్తయ్య, రచ్చ యాదగిరి, రమేశ్ పాల్గొన్నారు.

ధరణి దరఖాస్తులు పెండింగ్‌లో లేకుండా పరిష్కరించాలి

- కలెక్టర్ హనుమంతు కె.జెండగే

ధరణి కేంద్రంలో వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ హనుమంతు కె.జెండగే

ఆత్మకూరు(ఎం), జూలై 1 : ధరణి దరఖాస్తులు పెండింగ్ లేకుండా పరిష్కరించాలని కలెక్టర్ హనుమంతు కె.జెండగే రెవెన్యూ అధికారులను ఆదేశించారు. సోమవారం తాసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన ఆయన.. ధరణి కేంద్రాన్ని పరిశీలించి పెండింగ్ దరఖాస్తులు, ధరణి రిజిస్ట్రేషన్ల గురించి తెలుసుకున్నారు. అధికారులు, ఉద్యోగులందరూ సమయపాలన పాటించి ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఆయన వెంట డిప్యూటీ తాసీల్దార్ సయ్యద్ సఫియొద్దీన్, ఆర్ఐ మల్లికార్జున్‌రావు ఉన్నారు.

రైతుల అభిప్రాయాలను ప్రభుత్వానికి నివేదిస్తాం

- డీసీఓ నాగమణి

సమావేశంలో మాట్లాడుతున్న డీసీఓ నాగమణి

ఆత్మకూరు(ఎం), జూలై 1 : రైతు భరోసా అమలుపై రైతుల నుంచి సేకరించిన అభిప్రాయాలను ప్రభుత్వానికి నివేదిస్తామని డీసీఓ నాగమణి అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో సోమవారం రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. ఈ సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి 150మంది రైతులు హాజరయ్యారు. అర్హులైన రైతులందరికీ రైతు భరోసా ఇవ్వాలని పలువురు రైతులు కోరారు. పదెకరాల వరకు సాగు చేస్తున్న భూమికి రైతు భరోసా ఇవ్వాలన్నారు. సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ జిల్లాల శేఖర్‌రెడ్డి, జడ్పీటీసీ నరేందర్ గుప్తా, సీఈఓ కిరణ్‌కుమార్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

అటవీ వ్యవసాయ పద్ధతులపై రైతులకు శిక్షణ

రైతులకు శ్రీగంధం, మామిడి, వెదురు మొక్కలను అందిస్తున్న అటవీ వ్యవసాయ విభాగం, మండల వ్యవసాయాధికారులు

మోటకొండూర్, జూలై 1 : మండల కేంద్రంలోని రైతువేదికలో అటవీ వ్యవసాయ పద్ధతులపై షెడ్యూల్డ్ కులాల ఉప ప్రణాళిక ఆర్థిక సహాయంతో రాజేంద్రనగర్‌లోని జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని అటవీ వ్యవసాయ విభాగం ఆధ్వర్యంలో సోమవారం రైతులకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా అటవీ వృక్షాలైన శ్రీగంధం, వెదురు, మామిడి పంటల సాగుపై మెళకువలు, అవగాహన కల్పించారు. పంటల వైవిధ్యీకరణలో భాగంగా అటవీ వృక్షాలను సాగు చేసి దీర్ఘకాల ఆదాయాన్ని పొందాలని అటవీ వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు సూచించారు. కార్యక్రమంలో అటవీ వ్యవసాయ విభాగం శాస్త్రవేత్త చైతన్య, ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త అనిల్‌కుమార్, ఏఓ సుబ్బూరి సుజాత, ఎంపీటీసీ పన్నాల అంజిరెడ్డి, ఏఈఓలు రమేశ్, సురేశ్, సంధ్య పాల్గొన్నారు.

ఎన్ఆర్ఈజీఎస్‌తో ఎంతో మందికి ఉపాధి

- ఎంపీపీ చీర శ్రీశైలం

యాదగిరిగుట్ట, జూలై 1 : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా లక్షలాది కూలీలకు ఉపాధి దొరకడంతోపాటు గ్రామాల అభివృద్ధి జరుగుతుందని ఎంపీపీ చీర శ్రీశైలం అన్నారు. పట్టణంలో సోమవారం యాత్ర, ప్రజా పర్యవేక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఉపాధి హామీ పథకం సమగ్ర అమలుపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం అమల్లోకి వచ్చిన తర్వాత గ్రామాల్లో కూలీలకు వంద రోజుల పని గ్యారంటీ వచ్చిందన్నారు. పథకం వల్ల గ్రామాల్లో అనేక సుస్థిర ఆస్తులు నిర్మించబడ్డాయని తెలిపారు. ఉపాధి హామీ కూలీలకు పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉన్నదన్నారు. కార్యక్రమంలో యాత్ర డైరెక్టర్ సుర్పంగ శివలింగం, జడ్పీటీసీ తోటకూరి అనూరాధ, ఎంపీడీఓ నవీన్‌కుమార్, ఏపీఓ నారాయణ, ఎంపీఓ చంద్రశేఖర్, కేసరి యూత్ అధ్యక్షుడు రేగు బాలరాజు పాల్గొన్నారు.

ప్రకృతి ఆహారం తీసుకోవడం మానవ సంస్కృతి

- నేచురోపతి వైద్యుడు కేవై రామచంద్రరావు

మాట్లాడుతున్న నేచురోపతి వైద్యుడు రామచంద్ర రావు

చౌటుప్పల్, జూలై 1 : ప్రకృతి ప్రసాదించిన ఆహారాన్ని తీసుకోవడం మానవ సంస్కృతి అని నేచురోపతి వైద్యుడు కేవై రామచంద్ర రావు అన్నారు. జాతీయ వైద్య దినోత్సవంలో భాగంగా పట్టణంలోని త్రినిటీ పాఠశాలలో సోమవారం నిర్వహించిన అపూర్వ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాలకు చెందిన 100 మంది విద్యార్థులు మేము సైతం వైద్యులుగా సమాజానికి సేవలు అందిస్తామని వైద్యుల వేషధారణలో ప్రతిజ్ఞ చేశారు. అనంతరం రామచంద్రరావు మాట్లాడుతూ కళేబరాలను పూజించడం మానవ సంస్కృతి కాదన్నారు. ప్రకృతి ప్రసాదించిన సాత్విక భోజనం ప్రతి ఒక్కరూ తీసుకోవాలని సూచించారు. దాంట్లోనే ఆరోగ్యం దాగున్నదని పేర్కొన్నారు. విద్యార్థి దశ నుంచే ఇలాంటి అలవాట్లు నేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, వైద్యురాలు పద్మ, విద్యావేత్తలు గున్న రాజేందర్‌రెడ్డి, యానాల ప్రభాకర్‌రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ ఉజ్జిని మంజుల, చైర్మన్ కృష్ణారావు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- ఎంపీడీఓ నాగవేణి

సీజనల్ వ్యాధులు సోకకుండా జాగ్రత్తలను వివరిస్తున్న ఎంపీఓ దినకర్

రాజాపేట, జూలై 1 : సీజనల్ వ్యాధులు సోకకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ నాగవేణి అన్నారు. సీజనల్ వ్యాధులు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య పనులు ముమ్మరంగా చేపట్టాలన్నారు. దోమలతోపాటు అతిసార వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ గోపగాని బాలమణీయాదగిరిగౌడ్, ఎంపీఓ దినకర్, మండల వైద్యాధికారి సుప్రియా, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రోడ్డు వెడల్పుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి

- చిన్నకొండూరు భూ నిర్వాసితులు

చౌటుప్పల్, జూలై 1 : చిన్నకొండూరు రోడ్డును ప్రస్తుత ప్రణాళిక ప్రకారం 66 ఫీట్లు విస్తరణ చేస్తే ఇండ్లు కోల్పోయి రోడ్డున పడే అవకాశాలు ఉన్నాయని, ప్రత్యామ్నాయ మార్గాలు చూడాలని చిన్నకొండూరు రోడ్డు విస్తరణ భూ నిర్వాసితులు కోరారు. పట్టణంలోని భవానీనగర్‌లో సీతారామచంద్ర స్వామి దేవాలయం వద్ద సోమవారం భూ నిర్వాసితులు అఖిలపక్షం ఆధ్వర్యంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రోడ్డు విస్తరణ చేస్తే కలిగే నష్టాలను పరిశీలించారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, ఆర్డీఓ వి.శేఖర్‌రెడ్డి, తాసీల్దార్ హరికృష్ణకు వేర్వేరుగా వినతి పత్రాలు అందజేశారు. గతంలో మాదిరిగా రోడ్డు పనులు చేస్తే ఎవరికీ ఇబ్బంది జరుగదని భూ నిర్వాసితులు పేర్కొన్నారు. ఏండ్ల తరబడి ఇక్కడే నివాసముంటున్న తమకు నష్టం కలిగించకుండా ప్రత్యామ్నాయ మార్గాలు చూడాలని కోరారు.

కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి, బత్తుల శ్రీశైలం, శ్రీధర్‌బాబు, అరుణ్‌కుమార్, పరమేశ్, బాలకృష్ణ గౌడ్, మల్లేశం గౌడ్, గోవర్ధన్‌రెడ్డి, శంకర్, సురేందర్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, వెంకటేశ్, రాజేందర్‌గౌడ్, రాములు పాల్గొన్నారు.

మోత్కూరు ఇన్‌చార్జి ఎంపీడీఓగా శంకరయ్య

మోత్కూరు, జూలై 1 : ఇన్‌చార్జి ఎంపీడీఓగా శంకరయ్య సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేసిన ఎంపీడీఓ మనోహర్‌రెడ్డి ఇటీవల ఉద్యోగ విరమణ చేశారు. దాంతో ఆయన స్థానంలో అడ్డగూడూరు ఎంపీడీఓ శంకరయ్యకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తూ జడ్పీ సీఈఓ ఉత్తర్వులు జారీ చేశారు.

పార్టీలకతీతంగా అభివృద్ధి చేశాం : ఎంపీపీ సుధాకర్‌గౌడ్

ఎంపీపీ సుధాకర్‌ను సన్మానిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, అధికారులు

బీబీనగర్, జూలై 1 : పార్టీలకతీతంగా మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకున్నామని ఎంపీపీ యర్కల సుధాకర్‌గౌడ్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల ప్రత్యేక సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అనంతరం ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీ, మండల కో ఆప్షన్ సభ్యుల ఆత్మీయ పదవీ వీడ్కోలు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా పార్టీల సభ్యుల సహకారంతో మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకున్నామన్నారు. రాయరావుపేట గ్రామంలో నిర్మించిన రైతువేదిక రాష్ట్రంలోనే మంచి పేరు సాధించిందని తెలిపారు. పాఠశాలలను అభివృద్ధి చేశామని, చేసిన అభివృద్ధిని విద్యాశాఖ కమిషనర్ దేవసేన గుర్తించి ప్రశంసించారని తెలిపారు. అప్పటి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, సత్యసాయి అన్నపూర్ణ ట్రస్ట్ సహకారంతో మండలంలోని 58 పాఠశాలల్లో విద్యార్థులకు ఉదయం రాగి జావ పంపిణీ కార్యక్రమం చేపట్టామని చెప్పారు. పలువురు ఎంపీటీసీలు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమకు నిధులు కేటాయించకుండా అభివృద్ధి చేయకుండా చేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ గోలి ప్రణీతాపింగళ్‌రెడ్డి, వైస్ ఎంపీపీ వాకిటి గణేశ్‌రెడ్డి, తాసీల్దార్ ఎం.శ్రీధర్, ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో సమస్యలు పరిష్కరించాలి : సీపీఎం

పీహెచ్‌సీ వైద్యాధికారితో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

మోత్కూరు, జూలై 1 : మోత్కూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సమస్యలను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొల్లు యాదగిరి అన్నారు. పట్టణంలోని పీహెచ్‌సీని సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీహెచ్‌సీకి రోజుకు వంద మంది వైద్యం కోసం వచ్చి వెళ్తారన్నారు. ఇక్కడ పేరుకు ముగ్గురు డాక్టర్లు ఉన్నా.. విధులు నిర్వహించేది ఒక్కరేనని తెలిపారు. ల్యాబ్ టెక్నీషియన్లలో ఒకరు సొంత ల్యాబ్‌ను నడుపుతుండగా.. మరొకరు డిప్యూటేషన్‌పై వెళ్లడంతో పోస్టు ఖాళీగా ఉన్నదన్నారు. ఆయుర్వేద డాక్టర్ డిప్యూటేషన్‌పై వెళ్లడంతో ఏడాదిగా పోస్టు ఖాళీగా ఉన్నట్లు చెప్పారు. ఫార్మాసిస్టు, అటెండర్‌తోనే అరకొర వైద్యం అందిస్తున్నారని రోపించారు. మంచినీటి వసతి లేదని, పేషెంట్లకు వెయిటింగ్ హాల్ సరిగా లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పీహెచ్‌సీలో మెరుగైన వసతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు, నాయకులు కురిమేటి యాదయ్య, మెతుకు అంజయ్య, కొంపెల్లి గంగయ్య, చంద్రయ్య, నర్సింహ పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యలను పరిష్కరించాలి : సీపీఎం

సీసీ రోడ్డుపై నిలిచిన వర్షపు నీటిని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

భువనగిరి కలెక్టరేట్, జూలై 1 : గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి ప్రజలకు సరైన వసతులు కల్పించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నర్సింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని ముస్త్యాలపల్లిలో సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన గ్రామీణ ప్రజా సమస్యల అధ్యయనంలో భాగంగా చేపట్టిన పోరుబాట కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సర్పంచుల పదవీ కాలం ముగియడంతో గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని, పరిష్కారం చేయాలని కోరారు. సీపీఎం మండల కార్యదర్శి నర్సింహ, గ్రామ శాఖ కార్యదర్శి లక్ష్మీనర్సయ్య, నాయకులు దేవయ్య, రాజు, చంద్రయ్య, రమేశ్, భాస్కర్, కుమార్, యాదగిరి పాల్గొన్నారు.